

పార్టీ శ్రేణుల సంబురాల్లో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్

## ఇది ప్రజల విజయం : తలసాని

తన గెలుపు సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజల గెలుపేనని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని కాలేజ్ ఆఫ్ కామర్స్ వద్ద తలసాని మీడియాతో మాట్లాడారు. తాను గెలిచానన్న ఆనందం కంటే రాష్ట్రంలో అధికారంలోకి రాలేకపోతున్నామనే బాధ అధికంగా ఉందన్నారు. తన గెలుపునకు సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేగా తన బాధ్యతలను నిర్వర్తిస్తానని తలసాని తెలిపారు.

| సనత్‌నగర్ నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం పోల్ అయిన ఓట్లు | 1,28,263 |
| బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ | 72,557 |
| బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి | 30,730 |
| కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ | 22,492 |

# తలసాని హ్యాట్రిక్ విజయం

- 41,827 ఓట్ల భారీ మెజార్టీతో బీజేపీపై విజయం
- సనత్‌నగర్‌లో అభివృద్ధికి పట్టం కట్టిన ఓటర్లు
- పార్టీ శ్రేణుల సంబురాలు

బేగంపేట్/బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 3: సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ హ్యాట్రిక్ విజయం సాధించారు. 41,827 ఓట్ల మెజార్టీతో తలసాని భారీ విజయం సాధించి విజయ దుందుభి మోగించారు. నియోజకవర్గంలో మూడోసారి విజయం సాధించి సరికొత్త చరిత్రను సృష్టించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో 30,651 మెజార్టీ సాధించగా.. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం జరిగిన శాసనసభ ఎన్నికల్లో అధిక మెజార్టీతో విజయం సాధించారు. రెండవ స్థానంలో బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి, మూడవ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ నిలిచారు. సనత్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు 17 రౌండ్లలో నిర్వహించారు. ప్రతి రౌండ్‌లోనూ తలసాని తన ఆధిక్యతను చాటుకున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం రిటర్నింగ్ అధికారి కిషన్‌రావు చేతుల మీదుగా దానం నాగేందర్ ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పార్టీ శ్రేణులు ఆయనకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపునకు సహకరించిన నియోజకవర్గం ప్రజలు, ఓటర్లు, పార్టీ శ్రేణులకు ఆయన అభినందనలు తెలిపారు.

**పార్టీ శ్రేణుల సంబురాలు**

సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ గెలుపొందడంతో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. నియోజకవర్గంలోని అమీర్‌పేట్, బేగంపేట్, సనత్‌నగర్, మోండామార్కెట్, బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్ డివిజన్‌లలో పార్టీ డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు మహేశ్వరి, కొలన్ లక్ష్మి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్లు అరుణగౌడ్, శేషుకుమారి, ఆకుల రూపల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. జై శీనన్న అంటూ నినాదాలు చేశారు. కౌంటింగ్ కేంద్రానికి బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు అధికంగా తరలివచ్చి సంబురాలు జరుపుకున్నారు. దీంతో ప్రాంగణమంతా గులాబీమయంగా మారింది.



### అభివృద్ధిని గుర్తించారు.. గెలిపించారు..

సనత్‌నగర్ నియోజకవర్గంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ చేపట్టిన అభివృద్ధిని ప్రజలు గుర్తించారని అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి అన్నారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్లుగా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వచ్చిన తలసానిని మూడవ సారి కూడా ప్రజలు కడుపులో పెట్టుకుని కాపాడుకున్నారన్నారు. ఓయూలోని ఎన్నికల కౌంటర్ దగ్గర పార్టీ శ్రేణులతో కలిసి తలసాని విజయోత్సవ సంబురాల్లో పాల్గొన్నారు.

*– అమీర్‌పేట్, డిసెంబర్ 3*



పద్మారావునగర్‌లో సంబురాలు నిర్వహించిన బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్, నాయకులు

## సనత్‌నగర్ చరిత్రలో తొలి హ్యాట్రిక్

అమీర్‌పేట్, డిసెంబర్ 3 : నాలుగున్నర దశాబ్దాల సనత్‌నగర్ నియోజకవర్గ చరిత్రలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ సరికొత్త రికార్డుకు తెరతీశారు. గతంలో నాలుగు పర్యాయాలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మర్రి శశిధర్‌రెడ్డి విజయం సాధించినా వరుస విజయాలను అందుకోలేకపోయారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తరువాత సనత్‌నగర్ నుంచి రంగంలో నిలిచిన తలసాని ఆ ఎన్నికతో పాటు 2018లో కూడా చక్కటి విజయాన్ని నమోదు చేసుకున్నారు. మళ్లీ ఈ విజయంతో మూడోసారి హ్యాట్రిక్ కొట్టినట్లయింది.

## గులాబీ విజయంతో సంబురాలు



ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్ విజయఢంకా మోగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి సర్ఫరాజ్ నేతృత్వంలో ఆదివారం హిమాయత్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు స్వీట్లు తినిపించుకుని టపాకాయలు పేల్చి సంబురాలు జరుపుకున్నారు.

*– హిమాయత్‌నగర్, డిసెంబర్ 3*

## ఖైరతాబాద్ ప్రజలకు కృతజ్ఞతలు



ఖైరతాబాద్, డిసెంబర్ 3 : గడిచిన ఐదేండ్లుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ఎమ్మెల్యే చేసిన కృషి అభినందనీయం. ఈ ఎన్నికల్లో దానంకు గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటాం. దానం గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు.

*– కె.ప్రసన్న రామ్మూర్తి, చైర్ పర్సన్, హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ*

## కేసీఆర్‌ను గెలిపించాలనే పని చేశాం : దానం

బంజారాహిల్స్, డిసెంబర్ 3 : సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలన్న సంకల్పంతో పనిచేశామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో గత పదేండ్లుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, అయినా ఎక్కడో మిస్ ఫైర్ అయ్యిందన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో ప్రతిపక్షంలో ఉన్నా కూడా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైనా పోరాటం చేస్తామన్నారు. తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నందుకు ప్రజలకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

# ఖైరతాబాద్‌లో మరోసారి దానం విజయం



గెలుపొందిన అనంతరం విజయ చిహ్నాన్ని చూపిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే దానం నాగేందర్. చిత్రంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు

- భారీ మెజార్టీతో గెలుపు
- ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యత
- రెండో స్థానం కోసం పోటీ పడ్డ కాంగ్రెస్, బీజేపీలు

బంజారాహిల్స్, డిసెంబర్ 3 : ఖైరతాబాద్ గడ్డపై మరోసారి దానం నాగేందర్ విజయం సాధించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఇది రెండోసారి విజయం కాగా, భారీ మెజార్టీ అందుకున్నారు. తొలి రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి స్వల్ప మెజార్టీతో ముందుకు రాగా, మరో రౌండ్ నుంచి వెనక్కి పడిపోతూ వచ్చారు. అనంతరం బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి పలు రౌండ్లలో ముందుకు వచ్చేందుకు ప్రయత్నించి బోల్తా పడ్డారు. నాలుగు, ఐదో రౌండ్ తర్వాత దానం నాగేందర్ వెనక్కి తిరిగి చూసుకోలేదు. ప్రతి రౌండ్‌లోనూ ముందంజలో నిలిచారు. గట్టి పోటీ ఇస్తారని భావించిన కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిలు రెండోస్థానం కోసం పోటీపడగా, ఆ స్థానాన్ని విజయారెడ్డి దక్కించుకున్నది. మూడో స్థానంలో చింతల రామచంద్రా రెడ్డి నిలిచారు. ఈ పోటీలో దానం నాగేందర్‌కు 67,165 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డికి 45,061, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి 37,931 ఓట్లు వచ్చాయి. దానం నాగేందర్ 22,104 మెజార్టీతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, దానం నాగేందర్‌కు మెజార్టీ పెరుగుతుండటంతో పదో రౌండ్ ముగిసిన తర్వాత విజయారెడ్డి ఓటమిని గ్రహించి కౌంటింగ్ కేంద్రం నుంచి బయటికి వెళ్లిపోయారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత దానంను అభినందించేందుకు వేలాదిగా బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివచ్చారు. జై తెలంగాణ, జై డీఎన్‌ఆర్ నినాదాలతో కౌంటింగ్ కేంద్రం వద్ద అభిమానులు, కార్యకర్తలు హోరెత్తించారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత దానం నాగేందర్‌కు ఎన్నిక పత్రాన్ని రిటర్నింగ్ అధికారి వెంకటేశ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు వెల్దండ వెంకటేశ్, మన్నె కవిత, వనం సంగీత యాదవ్, మహాలక్ష్మి రమన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కాజా సూర్యనారాయణ, భారతినాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు రామన్‌గౌడ్, మామిడి నర్సింగరావు, వివిధ డివిజన్ల అధ్యక్షులు రాములు చౌహాన్, ఎస్‌కె అహ్మద్, ప్రవీణ్‌కుమార్, పలు డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

**పలు పార్టీల డిపాజిట్లు గల్లంతు**

ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఈసారి ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో పాటు మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆ మూడు పార్టీల తప్ప మిగతా వారిలో చాలా మందికి రెండంకెలు కూడా దాటలేదు. దీంతో అనేక మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి.

**బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు**

బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపును బీఆర్‌ఎస్ శ్రేణులు వేడుకగా జరుపుకున్నారు. కౌంటింగ్ కేంద్రమైన కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా నిలబడి దానంకు నీరాజనాలు పలికారు. దానం విజయ సంకేతాన్ని చూపిస్తూ ముందుకు సాగారు. భారీ ర్యాలీ నిర్వహించి పటాకులు కలిసి సంబురాలు చేసుకున్నారు.


18 వ వర్ధంతి



కీ॥శే॥ సత్యవరపు క్రిష్ణారావు
ది : 23-11-2005
(కార్తీక బహుళ సప్తమి)

మీ జ్ఞాపకాలు, అనుబంధాలు, ఆత్మీయతలు, ఆప్యాయత, ఎల్లవేళలా మా మదిలో పదిలంగానే ఉంటాయి. మీ ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

ఇట్లు

| కుమారులు | కోడళ్ళు |
|---|---|
| సత్యవరపు కిషోర్‌కుమార్ | వసంత |
| సత్యవరపు వీరభద్రరావు (వేణు) | వాసవి |
| సత్యవరపు నాగరాజు | అర్పిత |

మనువల్లు మరియు మనవరాల్లు